క్లుప్తంగా

అర్బన్ సీఐ పల్లె నిద్ర



గ్రామస్తులతో మాట్లాడుతున్న అర్బన్ సీఐ జయచంద్ర

రేణిగుంట: అర్బన్ సీఐ జయచంద్ర మంగళవారం రాత్రి మండలంలోని కరకంబాడిలో పల్లెనిద్ర చేసి, గ్రామస్తులకు పలు విషయాలపై అవగాహన కల్పించారు. పల్లెనిద్ర కార్యక్రమంలో భాగంగా మంగళవారం రాత్రి కరకంబాడిలో స్థానికులతో అర్బన్ పోలీసులు సమావేశమయ్యారు. మత్తు పదార్థాలు, డ్రగ్స్, సైబర్, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలోని విద్యార్థులకు నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో ఎవరైనా అపరిచిత వ్యక్తులు కనిపిస్తే స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని సీఐ కోరారు. ట్రైనీ ఎస్ఐ స్వాతి, గ్రామ పెద్దలు బుజ్జినాయుడు, మోహన్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఏరియా ఆస్పత్రి పరిశీలన



భోజనం వడ్డిస్తున్న ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు

శ్రీకాళహస్తి: స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని మంగళవారం హెచ్‌డీఎస్ కమిటీ సభ్యులు పరిశీలించారు. ఆస్పత్రి పరిసరాలను సందర్శించి రోగులతో మాట్లాడారు. రోగులు, వారి బంధువులకు పంపిణీ చేస్తున్న ఆహార నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆస్పత్రి అభివృద్ధి, రోగుల సంక్షేమంపై హెచ్ఎస్ కమిటీ నిబద్ధతతో పనిచేస్తుందని తెలిపారు. ఆస్పత్రిలో సౌకర్యాలు, సేవలను మెరుగుపరిచేందుకు అధికారులతో చర్చలు జరిపినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సభ్యులు గరికపాటి రమేష్‌బాబు, కుమార్, వినయ్, సుమతి తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల రద్దుపై దివ్యాంగుల నిరసన



నిరసన తెలుపుతున్న దివ్యాంగులు

బుచ్చినాయుడుకండ్రిగ: స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద మంగళవారం పింఛన్లు రద్దు చేశారని దివ్యాంగులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో గత ప్రభుత్వ హయాం నుంచి 651 మంది దివ్యాంగులకు పింఛన్ వస్తుందని తెలిపారు. కూటమి ప్రభుత్వం అన్యాయంగా 158 మంది పింఛన్లు రద్దు చేసిందని గగ్గోలు పెట్టారు. మేమంతా దివ్యాంగులమే అంటూ సదరం సర్టిఫికెట్లను చూపారు. కూటమి ప్రభుత్వం పింఛన్ల కోత విధించడం కోసమే 10 ఏళ్లుగా పింఛన్ తీసుకుంటున్న వారి పింఛన్ రద్దు చేయటం దారుణమన్నారు.

పోలీసు అవుట్‌పోస్టు ఏర్పాటు



పోలీసు అవుట్‌పోస్టులో ఉన్న పోలీసు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి ప్రభుత్వాస్పత్రి వద్ద మంగళవారం రెండో పట్టణ పోలీసుల ఆధ్వర్యంలో పోలీసు అవుట్ పోస్టు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ నాగార్జునరెడ్డి మాట్లాడుతూ రోగుల భద్రత, వైద్య సిబ్బంది విజ్ఞప్తి మేరకు రాత్రి పూట పోలీసు అవుట్ పోస్టును ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

అండర్‌బ్రిడ్జిలో ఇరుక్కున్న ట్యాంకర్

రేణిగుంట: రేణిగుంట– శ్రీకాళహస్తి రహదారి పాత చెక్ పోస్ట్ సమీపంలోని రైల్వే అండర్ బ్రిడ్జిలో ట్యాంకర్ ఇరుక్కుపోవడంతో ట్రాఫిక్ స్తంభించింది. మంగళవారం శ్రీకాళహస్తి వైపు నుంచి వచ్చిన ట్యాంకర్ అండర్ బ్రిడ్జిలో ఇరుక్కోవడంతో రెండు వైపులా వాహనాలు నిలిచిపోయాయి. అందులో అంబులెన్స్ కూడా ఉండడంతో రేణిగుంట అర్బన్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ముందుగా అంబులెన్స్‌కు ట్రాఫిక్ క్లియర్ చేసి పంపించారు.

సేవాలయం.. నిర్వీర్యం

గాంధీజీ కలలు కన్న గ్రామస్వరాజ్యాన్ని గతంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్థాపించారు. పల్లె ముంగిటే సేవలు అందించారు. గ్రామీణులకు చిన్న కష్టం వచ్చినా తనదిగా భావించి, స్పందించారు. వారి కష్టాలను తీర్చారు. కూటమి గద్దెనెక్కిన నాటి నుంచి పల్లెవాసులకు పుట్టెడు కష్టాలు తప్పడం లేదు. గత సర్కారు ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థను నీరుగార్చి, గ్రామీణులకు సేవలు దూరం చేసింది. దీంతో వారు ఇక్కట్లు పడుతున్నారు.

- సమయపాలన పాటించని సచివాలయ సిబ్బంది
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు



చియ్యవరం సచివాలయంలో వేచి ఉన్న ప్రజలు



బురదమయంగా మారిన సచివాలయ ప్రాంగణం

తొట్టంబేడు: కూటమి సర్కారు గద్దెనెక్కిన తరువాత ప్రజలకు వారి ముంగిటే సేవలు అందించే సచివాలయ వ్యవస్థ నిర్వీర్యం అయ్యింది. ఫలితంగా ప్రజలు సకాలంలో సేవలందక ఇక్కట్లు పడుతున్నారు. మండలంలోని చియ్యవరం సచివాలయంలో సిబ్బంది సమయపాలన పాటించకపోవడమే ఇందుకు నిదర్శంగా చెప్పవచ్చు. ఉదయం 11.30 గంటలు దాటినా పలువురు సచివాలయ ఉద్యోగులు విధులకు హాజరు కాలేదు. దీంతో వివిధ పనుల కోసం వచ్చిన ప్రజలు గంటల కొద్దీ వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ఎవరైనా ప్రశ్నిస్తే కొందరు డిప్యూటేషన్‌పై ఉన్నారని, మరికొందరు ఇంకా రాలేదని పొంతన లేని సమాధానం చెబుతున్నారు. వాస్తవానికి రెండు రోజుల క్రితమే డిప్యూటేషన్లు ముగిసినట్లు రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. అయితే ఇక్కడి అధికారులు మాత్రం డిప్యూటేషన్ కారణంగా చెబుతున్నారు. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థను నీరుగారుస్తున్నారని ప్రజలు వాపోతున్నారు. ప్రజలకు చేరువ కావాల్సిన పథకాలను అందుకుండా చేస్తున్నారని వాపోతున్నారు. ఇక సచివాలయ ప్రాంగణంలోని రోడ్డు ఇటీవల కురిసిన వర్షానికి బురదమయంగా మారింది. కాలు తీసి కాలు పెట్టాలంటే అలవికాని పరిస్థితి నెలకొంది. అయినా దాన్ని గురించి పట్టించుకునే నాథుడే కరువయ్యారు. దీంతో సచివాలయానికి వచ్చే ప్రజలు లోనికి వెళ్లడానికి సాహసాలు చేయాల్సి వస్తోంది. ఇంత చేసి సచివాలయంలోకి అడుగు పెడితే అక్కడ అధికారులు లేకపోవడంతో ప్రజలు ఉసూరోమంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి చియ్యవరం గ్రామ సచివాలయ వ్యవస్థను గాడిన పెట్టి తమకు పథకాలు చేరువ చేయాలని ప్రజలు కోరుతున్నారు.

చవితి మండపాలకు అనుమతి తప్పనిసరి

శ్రీకాళహస్తి: వినాయక చవితి సందర్భంగా పోలీసుల అనుమతి పొందిన తరువాత మాత్రమే విగ్రహాలు ఏర్పాటు చేయాలని డీఎస్పీ నరసింహమూర్తి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన మాట్లాడుతూ వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసే వారు శ్రీకాళహస్తి ఆర్డీఓ ద్వారా సింగిల్ విండో విధానంలో అనుమతులు తీసుకోవాలన్నారు.

ఏర్పేడు: వినాయక చవితి ఉత్సవాల్లో వినాయక విగ్రహాల ఏర్పాటుకు తప్పనిసరిగా పోలీసుల అనుమతి తీసుకోవాలని ఏర్పేడు సీఐ శ్రీకాంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఏర్పేడు పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసే ఆయా కమిటీలు, గ్రామస్తులు తప్పనిసరిగా పోలీసుల అనుమతి తీసుకోవడంతో ప్రతి విగ్రహం ఏర్పాటుకు పోలీసులు నంబర్ ఇవ్వడం జరుగుతుందన్నారు.

అభినందన



మొక్క అందజేస్తున్న మధుసూదన్ రావు

రేణిగుంట: రేణిగుంట ఆర్పీఎఫ్ అసిస్టెంట్ సెక్యూరిటీ కమిషనర్ కే.రాజగోపాల్ రెడ్డి ప్రతిష్టాత్మక ప్రెసిడెంట్ మెడల్ (రాష్ట్రపతి పతకం)కు ఎంపిక కావడంతో ఆయన్ని పలువురు అభినందించారు. మంగళవారం రాత్రి ఆయన నివాసంలో విజయవాడ రైల్వే క్రైమ్ ఇన్వెస్టిగేషన్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ మధుసూదన్ రావు మొక్క అందజేసి అభినందించారు.

ఉచిత విద్య వినియోగంలో విఫలం

తొట్టంబేడు: ఉచితాలు కోరుకునే ప్రజలు ఉచిత విద్యను వినియోగించుకోవడంలో మాత్రం విఫలమవుతున్నారని ఏఐఎస్ఎఫ్ తిరుపతి జిల్లా సహాయ కార్యదర్శి కోగిలి మునిచందు అన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలో ఉన్న సౌకర్యాలు ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలు, కళాశాలలో లేకపోయినప్పటికీ రూ.వేలు ఖర్చు పెడుతూ ప్రభుత్వ పథకానికి గండి కొడుతున్నారన్నారు.

అవనాక్షమ్మ జాతర చాటింపు

నారాయణవనం: మండలంలోని సముదాయంలో టీటీడీ అనుబంధంగా ఉన్న అవనాక్షమ్మ ఆలయంలో అమ్మవారి జాతర మంగళవారం సాయంత్రం ప్రత్యేక పూజలతో ప్రారంభమైంది. ఆలయాధికారి నాగరాజు మాట్లాడుతూ 18 రోజుల పాటు నిర్వహించే జాతరలో చివరి మూడు రోజులైన సెప్టెంబరు 3 నుంచి 5వ తేదీ వరకు అమ్మవారి ఊరేగింపు సముదాయం, కీళగరం, నారాయణవనం గ్రామాల వీధుల్లో నిర్వహిస్తున్నట్లు నాగరాజు తెలిపారు. మంగళవారం ఉదయం ఆలయాన్ని తెరిచిన అర్చకులు మూలవర్లకు సర్కారు అభిషేకం చేశారు. అవనాక్షమ్మ ఉత్సవ విగ్రహానికి స్నపన తిరుమంజనం నిర్వహించి జాతర ప్రారంభ సందర్భంగా కంకణధారణ చేపట్టారు.

టీకాలతో వ్యాధులు దూరం

బుచ్చినాయుడుకండ్రిగ: పిల్లలకు టీకాలు వేయడంతో వ్యాధులు దూరం అవుతాయని మండల ఆరోగ్య అధికారి వెంకటేశులు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రత్యేక వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆయన గాజులపెళ్లూరు ఎస్టీకాలనీలోని ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న పిల్లలకు వివిధ రకాల టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీకాలు వేయడంతో టిటానస్ జబ్బులు రావని తెలిపారు. శరీరం, పరిసరాలు, ఆహార శుభ్రతతో పలు రకాల జబ్బులను నివారించవచ్చన్నారు.

రైతుల మొర ఆలకించండి

రేణిగుంట: రైతుల మొర ఆలకించాలని అత్తూరు సర్పంచ్ ప్రసాద్ రెడ్డి, ఎంపీపీ హరిప్రసాద్ రెడ్డి మంగళవారం తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. అత్తూరు పంచాయతీలోని రైతులు పడుతున్న ఇబ్బందులను తహసీల్దార్‌కు వివరిస్తూ వినతిపత్రం అందజేశారు.

కార్మికుడి దుర్మరణం

నారాయణవనం: మండలంలోని జాతీయ రహదారిపై పాలమంగళం సమీపంలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గ్రార్మెట్స్ కంపెనీలో పని చేస్తున్న మురగయ్య(39) దుర్మరణం చెందాడు. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. మండలంలోని నైనారుకండ్రిగ దళితవాడకు చెందిన మురగయ్య పాలమంగళం సమీపంలోని గార్మెట్ కంపెనీలో పనిచేస్తున్నాడు. షిఫ్ట్ ముగించుకుని మంగళవారం రాత్రి ఇంటికి మోటార్‌సైకిల్‌పై బయలుదేరాడు. పాలమంగళం దాటాక జాతీయరహదారిపై మురగయ్య మోటార్ సైకిల్‌ను గుర్తు తెలియని వాహనం ఢీకొని వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో కిందపడిన మురగయ్యపై వాహనం వెళ్లడంతో తల పూర్తిగా ఛిద్రమైంది. స్థానికుల సమాచారంతో ప్రమాద స్థలానికి చేసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం పుత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేస్తున్నట్లు ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు.

పరామర్శ



దయానందనాయుడితో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: పట్టణంలోని నాయుడు బిల్డింగ్స్‌లో ప్రమాదవశాత్తు కాలు జారి పడి ఇంటి వద్ద చికిత్స పొందుతున్న దయానంద్‌నాయుడిని మంగళవారం రాత్రి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి పరామర్శించారు. ఎలా జరిగిందని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తీశ్వరాలయ పాలమండలి మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, నాయకులు సురేష్, కంఠా ఉదయ్‌కుమార్, పఠాన్‌ఫరీద్, సాధన మున్నారాయల్, బుల్లెట్ జయశ్యామ్, పులి రామచంద్ర, చిర్రి నాగేశ్వరరావు, మధురెడ్డి, శ్రీనివాసులుజెట్టి, కామి వెంకటేశ్వర్లు, బాల తదితరులు పాల్గొన్నారు.

నివాళి

రేణిగుంట: మండలం, ఎల్లమండ్యం పంచాయతీ, కొత్తపాలెం గ్రామానికి చెందిన జనార్దన్ సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి మంగళవారం గ్రామానికి చేరుకుని జనార్దన్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట జెడ్పీటీసీ మాజీ సభ్యుడు తిరుమల రెడ్డి, డీసీసీబీ మాజీ అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గంగారి రమేష్, గంగయ్య, పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్, పళణి, గుణశేఖర్, ముని తదితరులు ఉన్నారు.

సేంద్రియ సాగుపై మక్కువ చూపాలి



పంట చీడపీడలపై అవగాహన కల్పిస్తున్న ఏఓ షణ్ముగం

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని రైతులు సేంద్రియ వ్యవసాయంపై మక్కువ చూపాలని, ఖరీఫ్ పంట సాగులో రైతులు సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలని మండల వ్యవసాయాధికారి షణ్ముగం అన్నారు. మంగళవారం మండలంలోని నీర్పాకోట, గాజులపెళ్లూరు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పంటల సాగులో అధికారుల సూచనల మేరకు సాగు చేసుకుంటే అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. విత్తనానికి ముందు విత్తనశుద్ధి చేసుకోవాలని, అలాగే భూసార పరీక్షలు ఆధారంగా భూసారం ఆధారంగా పంటలు సాగు చేసుకుంటే అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గంగయ్య, ఏఈఓ రేవతి తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు దుస్తుల పంపిణీ

శ్రీకాళహస్తి: స్థానిక మహిళా డిగ్రీ కళాశాల మైదానంలో జరుగుతున్న బాల్ బ్యాడ్మింటన్ శిక్షణ పొందుతున్న సీనియర్, సబ్ జూనియర్ క్రీడాకారిణులకు గ్రీన్‌ప్యానల్ కంపెనీ ప్రతినిధులు క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. గ్రీన్ ప్యానెల్ కంపెనీ ఉద్యోగులు బాల సుధీర్, బాలాజీ క్యాంపు వద్దకు విచ్చేసి క్రీడాకారులకు కావాల్సిన సౌకర్యాలు కల్పించి, దుస్తులు అందజేశారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ



పిల్లలలో ముచ్చటిస్తున్న వసంతాబాయ్

నారాయణవనం: మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాలను పథక సంచాలకులు వసంతబాయ్ మంగళవారం తనిఖీ చేశారు. రికార్డులు, స్టాక్‌ను పరిశీలించి పిల్లల అభ్యసన ప్రమాణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బంకమట్టి బొమ్మలు, చార్ట్‌లపై గీసిన చిత్రాలను పరిశీలించి, పిల్లలను అభినందించారు. మెనూ ప్రకారం తయారు చేసిన ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించి మరింత రుచిగా, శుచిగా తయారు చేయాలని సూచించారు. తనిఖీల్లో ఐసీడీఎస్ సీడీపీఓ సౌభాగ్యమ్మ, సూపర్‌వైజర్ బేబీ తదితరులు పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగంపై విచారణ



విచారణ జరుపుతున్న డీఎల్‌పీఓ సురేష్‌నాయుడు

సత్యవేడు: మండలంలోని చెరివి పంచాయతీలో నిధుల దుర్వినియోగంపై తిరుపతి డీఎల్‌పీఓ సురేష్ నాయుడు విచారణ చేపట్టారు. మంగయ్య ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ సి.విజయకుమార్ చెరివి పంచాయతీలో రూ. 50 లక్షలు దుర్వినియోగం చేశారన్న ఫిర్యాదుపై మంగళవారం డీఎల్‌పీఓ 2014 నుంచి 2024 వరకు పనిచేసిన పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్, విస్తరణ అధికారితో కలిపి విచారణ చేపట్టారు. పలువురు సెక్రటరీలు విచారణకు రికార్డులు తీసుకురాలేదు. 10 రోజుల లోపు చెరివి పంచాయతీ కార్యాలయానికి చెందిన రికార్డులు సమర్పించాలని సెక్రటరీలను డీఎల్‌పీఓ ఆదేశించారు. రికార్డులు పూర్తి స్థాయిలో పరిశీలించిన అనంతరం డీపీఓకు విచారణ నివేదిక అందజేస్తామన్నారు. ఈకార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ త్రివిక్రమరావు, ఇన్‌చార్జి ఈఓపీఆర్డీ మునిరవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విరివిరిగా బ్యాంకు రుణాలు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కాటూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ద్వారా రైతులు, వ్యాపారులకు విరివిరిగా రుణాలను అందజేస్తున్నట్లు అసిస్టెంట్ రిజిస్ట్రార్, అఫిషియల్ పర్సన్ ఇన్‌చార్జ్ రవిబాబు తెలిపారు. మంగళవారం బుచ్చినాయుడుకండ్రిగ కాటూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో ఆవరణలో బ్యాంకు రుణాలకు సంబంధించి రైతులకు అవగాహన సమావేశం నిర్వహించారు. సీఈఓ మహేష్, సిబ్బంది చంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

శ్రీసిటీలో కొరియా రిపబ్లిక్ కాన్సుల్ జనరల్



శ్రీసిటీని సందర్శించిన కొరియా రిపబ్లిక్ కాన్సుల్ జనరల్ ప్రతినిధుల బృందం

శ్రీసిటీ (వరదయ్యపాళెం): చెన్నైలోని కొరియా రిపబ్లిక్ కాన్సుల్ జనరల్ చాంగ్ న్యూన్ కిమ్ మంగళవారం శ్రీసిటీని సందర్శించారు. కొరియా ట్రేడ్–ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ ఏజెన్సీ (కోట్రా) అధికారులు, కొరియన్ వ్యాపార ప్రతినిధుల బృందంతో కలిసి విచ్చేసిన ఆయనకు శ్రీసిటీ ప్రెసిడెంట్ (ఆపరేషన్స్) సతీష్ కామత్, అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ (బిజినెస్ డెవలప్‌మెంట్) బోడ్గన్ జార్జ్ సాదర స్వాగతం పలికారు. అనంతరం శ్రీసిటీ ప్రగతి, ప్రత్యేకతలపై సీనియర్ వైస్ ప్రెసిడెంట్ (మార్కెటింగ్) ఆర్.శివశంకర్ వారికి సమగ్ర ప్రదర్శన ఇచ్చారు. వ్యూహాత్మక స్థానం, వివిధ పరిశ్రమలు, సామాజిక మౌలిక సదుపాయాలు, శ్రీసిటీలో పరిశ్రమల ఏర్పాటుతో ఒనగూరే నిర్దిష్ట ప్రయోజనాలను వివరించారు. ఉత్సాహంగా చర్చల్లో పాల్గొన్న ప్రతినిధి బృందం, వివిధ ప్రశ్నల ద్వారా శ్రీసిటీలోని పలు పారిశ్రామిక జోన్లు, సామాజిక మౌలిక సదుపాయాలు, హరిత కార్యక్రమాలు గురించి తెలుసుకున్నారు.

విజయవంతంగా కార్యకలాపాలు

కాన్సుల్ జనరల్ పర్యటనపై స్పందించిన శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, కొరియా పెట్టుబడిదారుల విశ్వాసాన్ని పెంచేందుకు ఇది సహకరిస్తుందని వ్యాఖ్యానించారు. 31 దేశాలకు చెందిన 240కు పైగా కంపెనీలకు నిలయంగా అత్యంత విలువైన పెట్టుబడి గమ్యస్థానంగా శ్రీసిటీ మారిందన్న ఆయన, ఈ పయనంలో కొరియా కీలక పాత్ర పోషిస్తుందన్నారు.

రోడ్డు మరమ్మతు చేయాలని ఆందోళన



ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని ఆలత్తూరు, పీవీకండ్రిగ, పుత్తేరి, కత్తివారికండ్రిగ, రెడ్డిగుంటబాడవ, పట్టాభి గిరిజన కాలనీ, గ్రామాలకు కేటీరోడ్డు నుంచి వెళ్లే రోడ్డు మరమ్మతులు చేయాలని మంగళవారం కత్తివారికండ్రిగ గ్రామస్తులు రోడ్డుపై ఆందోళన చేశారు. మెటల్ తీసుకెళుతున్న టిప్పర్లను అడ్డుకుని, నిలిపివేశారు. వారు మాట్లాడుతూ ఈ రోడ్డు మీదుగా క్రషర్లు, క్వారీలు ఉన్నాయని, క్రషర్లు, క్వారీల నుంచి లారీల్లో 50 టన్నులకు పైగా బరువున్న మెటల్ రవాణా చేస్తున్నారని తెలిపారు. దీంతో రోడ్డు దెబ్బతినిందని, ఈ రోడ్డుపై భారీగా గుంతలు ఏర్పడంతో అధ్వాన్నంగా తయారైందని, గత వారం రోజులుగా కురుస్తున్న వర్షానికి గుంతల్లోకి నీరు చేరి రొచ్చుగా తయారు అవుతుందని వాపోయారు. సంబంధితశాఖ ఉన్నతాధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని, లేకుంటే కేటీరోడ్డుపై రాస్తారోకో చేస్తామని హెచ్చరించారు.

కల్యాణ వెంకన్నకు ఏకాదశి ఉత్సవం



నారాయణవనం: పద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం ఏకాదశి ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంగళవారం సాయంత్రం ఉత్సవర్లు మాడవీధుల్లో విహరించారు. ఉదయం ఏకాదశి గడియల్లో అర్చనలు పూర్తి చేశారు. సాయంత్రం తిరుచ్చి వాహనంపై శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామివారిని తిరుచ్చిపై కొలువుదీర్చి, మాడ వీధుల్లో విహరించారు. ఆలయాధికారి నాగరాజు, అర్చకులు నరసింహభట్టాచార్య పర్యవేక్షించారు.

క్రీడా పరికరాల పంపిణీ

శ్రీకాళహస్తి: పట్టణంలోని లోకబాది గిరిజ కాలనీలో ఉన్న పాపాగారి సుభద్రమ్మ పురపాలక సంఘం ప్రాథమిక పాఠశాలలో మంగళవారం హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ అధ్వర్యంలో సుమారు 40 మంది విద్యార్థులకు చెస్, క్యారంబోర్డు, బాలు, బ్యాట్ వంటి క్రీడా పరికరాలను వితరణ చేశారు. ఈ సందర్భంగా న్యాయవాది గరికపాటి రమేష్‌బాబు మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు ఎంతో అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకులు మునీర్‌బాషా, సభ్యులు బాబా ఫరీద్, గాంధీ తదితరులు పాల్గొన్నారు.

పేదల ఇళ్ల కూల్చివేత సరే.. భూ కబ్జాల మాటేంటి..?

- తహసీల్దార్‌ను నిలదీసిన ప్రజాప్రతినిధులు
- వాడివేడిగా మండల మీట్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ హరిప్రసాద్ రెడ్డి

రేణిగుంట: కూటమి ప్రభుత్వంలో జరుగుతున్న భూ ఆక్రమణలను వదిలేసి, గత ప్రభుత్వంలో పేదలు కట్టుకున్న ఇళ్లను పడగొట్టడం దారుణమని మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులు తహసీల్దార్‌ను నిలదీశారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం ఎంపీపీ హరిప్రసాద్‌రెడ్డి అధ్యక్షతన మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ప్రభురావు ఆధ్వర్యంలో వివిధ శాఖల అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలను సభ్యులకు వివరించారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు మాట్లాడుతూ పంచాయతీల్లో జరిగే గ్రామసభల్లో అధికారులు ప్రొటోకాల్ పాటించడం లేదని సభ దృష్టికి తెచ్చారు. తమని ప్రజా ప్రతినిధులుగా గుర్తిస్తున్నారా? లేదా అని ప్రశ్నించారు. ఎంపీపీ హరిప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ పూడి – ఏర్పేడు నూతన రైల్వేలైన్‌లో భూసేకరణ సమయంలో రైతులకు కనీస సమాచారం ఇవ్వలేదన్నారు. గాజులమండ్యం ఎంపీటీసీ సభ్యుడు వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ మండలంలోని స్వర్ణముఖినదిలో యథేచ్ఛగా సాగుతున్న ఇసుక దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేశారు. ఎంపీటీసీ సభ్యుడు జువ్వలదయాకర్‌రెడ్డి మాట్లాడుతూ జగనన్న కాలనీకి శ్మశాన స్థలం కేటాయించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు సంధ్య, కోఆప్షన్ సభ్యులు హసన్ సాహెబ్, గాజుల మండ్యం సర్పంచ్ గంగారి రమేష్, విప్పమానుపట్టెడ సర్పంచ్ లక్ష్మీపతిరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు ఆనందరావు, ఏఓ పిచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.